క్లుప్తంగా

కార్తిక వనసమారాధన

కిర్లంపూడి: కార్తికమాసాన్ని పురస్కరించుకుని జగపతినగరం అభయ దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, సరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల ర్యాలీ

ఏలేశ్వరం: సేఫ్ ఆన్ రోడ్ కార్యక్రమంపై శనివారం పట్టణంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు స్థానిక లింగంపర్తి రోడ్డు నుంచి బాలాజీ చౌక్ వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ మాట్లాడుతూ రహదారిపై నడిచేటప్పుడు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు రహదారి నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

విద్యుత్ పనులకు శ్రీకారం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో త్రీ ఫేజ్ విద్యుత్ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ట్రాన్స్ కో ఏఈ సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ స్కీమ్‌లో భాగంగా గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇకపై గ్రామంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడపా పార్థసారథి, యార్లగడ్డ రాజాచౌదరి, చిక్కాల లక్ష్మణరావు, గొంతిరెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఓటు నమోదుపై అవగాహన

ప్రత్తిపాడు: అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక నైపుణ్య కళాశాలలో కొత్త ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటు నమోదు కోసం బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటు ప్రాధాన్యం, ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు తహసీల్దార్ గోపాలకృష్ణ ఫారం–6 ఇచ్చి కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తులు చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

జగ్గంపేట: గుర్రంపాలెం రోడ్డు సమీపాన పోలవరం కాలువలో ప్రమాదవశాత్తూ జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. జగ్గంపేట హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. స్థానిక శెట్టిబలిజపేటకు చెందిన కుప్ప చంద్రావు (63) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి బయలుదేరిన అతడు పోలవరం కాలువ వద్ద కాలకృత్యాలు తీర్చుకుంటూ ప్రమాదవశాత్తూ కాలు జారి, అందులో పడి మృతి చెందాడు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తుని: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తుని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మేరీ సమాదానం, ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు సుబ్బలక్ష్మి, లలిత, మహాలక్ష్మి, ఇందిరా, సత్యవేణి, రవణమ్మ, కామేశ్వరి పాల్గొన్నారు.

జగ్గంపేట: తమకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ జగ్గంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీలు నిరహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రేషన్ వాహనాలపై మోదీ ఫొటో ముద్రించాలి

తుని/ప్రత్తిపాడు: ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రేషన్‌కు సంబంధించి నడుపుతున్న వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర యువమోర్చా కన్వీనర్ అనిరుద్ వర్మ కోరారు. ఈ మేరకు శనివారం తుని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనురుధ్ వర్మ మాట్లాడుతూ పేదలకు ఇచ్చే రేషన్‌లో కేంద్రం వాటా 60 శాతం ఉందన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకోవడం సరికాదన్నారు. తుని నియోజకవర్గం కన్వీనర్ వెలుగుల గోపాల కృష్ణ, తుని పట్టణశాఖ అధ్యక్షుడు పడాల విశ్వనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రగడ చక్రరావు, నియోజకవర్గం కో కన్వీనర్ లాలం లోవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడులో బీజేపీ నాయకులు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ పంపిణీ వాహనాలపై తప్పనిసరిగా పీఎం మోదీ ఫొటో ముద్రించాలని కోరారు.

వన విందుకు వెళ్లొద్దాం రండి

- కార్తిక వనసమారాధనలు ప్రారంభం
- మూడు నియోజకవర్గాల్లో పలు పిక్నిక్ స్పాట్లు
- నేడు పలు ప్రాంతాల్లో వనభోజనాలు



కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమం వద్ద పిక్నిక్ స్పాట్



అద్దరిపేట తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తుని రూరల్: కార్తికమాసం వచ్చిందంటే వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు, స్నేహితులు, విద్యార్థులు, వివిధ కుల, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు (పిక్నిక్‌లు) నిర్వహిస్తారు. స్నేహితులు, కుటుంబాలు, సంఘాలలో సభ్యులు ఐక్యంగా ఉసిరి చెట్ల కింద, మామిడి, జీడి మామిడి, కొబ్బరి తోటల్లో చేరి ఆటపాటలతో సందడి చేస్తారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారు. అందుబాటులో ఉండే నదులు, సముద్రాల్లో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని ఉన్న ఆలయాల్లో దైవదర్శనాలు చేసుకుని సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు. కార్తికమాసంలో మొదట ఆదివారం కావడంతో నేడు పలు వర్గాల వారు వన సమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వన సమారాధనలకు అనువైన ప్రాంతాలు (ఫిక్నిక్ స్పాట్లు) ఎన్నో ఉన్నాయి. ఈ సంవత్సరం కార్తిక మాసంలో నాలుగు ఆదివారాలు ఉండడంతో ఆయా ప్రాంతాల్లో సాధారణ రోజుల కంటే ఆదివారాల్లో అధిక సంఖ్యలో వనసమారాధనలు జరగనున్నాయి.

ఫిక్నిక్ స్పాట్లు

మూడు నియోజకవర్గాల పరిధిలో కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారి లోవ ప్రాంగణం, సమీపంలో మామిడి తోటలు, కుమ్మరిలోవ సచ్చిదానంద తపోవనం ఆశ్రమం, తుని, కోటనందూరు మండలాల్లో విస్తరించి ఉన్న తాండవ నదీ పరివాహక ప్రాంతం, సమీపంలోని శివాలయాలు, అద్దరిపేట నుంచి పెరుమాళ్లపురం వరకూ విస్తరించి ఉన్న సముద్రం (బీచ్), నిత్యం ప్రవహించే పాతాళగంగతో ధారమల్లాపురం, ఆంధ్రా శబరిమల, అన్నవరంలో వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం, పంపా రిజర్వాయర్, పరివాహక ప్రాంతాలతో పాటు మరెన్నో వన సమారాధనలకు అనువువైన ప్రదేశాలు ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో సైతం తాండవ రిజర్వాయర్, సముంద్రం (బీచ్), ఇతర ఫిక్నిక్ స్పాట్లు ఉన్నాయి.

నేడు వనసమారాధనలు

పవిత్ర కార్తికమాసం ఆరంభమైన తర్వాత ఈ నెల 19న తొలి ఆదివారం కావడంతో ఆయా ప్రాంతాలకు వేలాది మంది భక్తులు వన సమారాధనలకు వెళ్లనున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి, దైవ దర్శనాలు చేసుకోనున్నారు. నదులు, రిజర్వాయర్లు, సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉత్సాహంలో నిర్లక్ష్యం వహిస్తే కనురెప్పపాటులో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ నెల 19, 26, డిసెంబర్ 3, పది తేదీల్లో ఆదివారాలు వచ్చాయి. డిసెంబర్ 13వ తేదీ పాడ్యమి పుణ్యస్నానాలు, ఆకాశ దీపారాధనతో కార్తికమాసం ముగియనుంది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సెక్టోరల్ అధికారులతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించి తమకు సమగ్ర రిపోర్టు ఇవ్వాలన్నారు. అనంతరం స్థానిక నైపుణ్య డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ కాసులమ్మ, శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది గంగరాజు, శోభ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి: తాళ్లూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాస్వామి ఆలయానికి శనివారం భక్తు లు పోటెత్తారు. కార్తిక మాసంలో మొదటి శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండపోడు భూములకు పట్టాల పంపిణీ



పోతులూరు కొండపోడు భూమి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో కొండపోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం అందజేశారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు కొండపోడు భూమి రైతులను కాకినాడ తీసువెళ్లి కలెక్టర్ చేతుల మీదుగా పట్టాలు ఇప్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీరబాబు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ చొరవ తీసుకొని పరిష్కరించారన్నారు. మొదటి విడతగా 180 ఎకరాల కొండ పోడు భూమిని 164 మంది రైతులకు కేటాయించి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 100 ఎకరాల భూమిని 150 మంది రైతులకు కేటాయించి పట్టాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఎంతో కాలంగా పరిష్కారం కాని కొండపోడు భూమి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో గుర్రాజు, గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, బర్ల చక్రం, రేఖ దొరబాబు, కట్టమూరి లోవతల్లి, ఏడిద నగేష్, కట్టమూరి కృష్ణ, వీఆర్‌ఏ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన కస్టమ్స్ జాయింట్ కమిషనర్ సౌమ్య



కస్టమ్స్ విభాగం జాయింట్ కమిషనర్ సౌమ్య దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: కస్టమ్స్ విభాగం జాయింట్ కమిషనర్ నూతలపాటి సౌమ్య దంపతులు శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి వ్రతం, దర్శనం అనంతరం వారికి వేద పండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలను బహూకరించారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



మదర్ స్కూల్‌లోని సరస్వతీదేవి ఆలయంలో వరి కుచ్చులను వేలాడదీస్తున్న దాలినాయుడు

కోటనందూరు: పిచ్చుకల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, విశ్రాంత హెచ్‌ఎం పోలుపర్తి దాలినాయుడు కోరారు. స్థానిక మదర్ విద్యానికేతన్‌లో విద్యార్థులకు శనివారం పిచ్చుకల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దాలినాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు ఆధునిక పోకడలకు అధిక ప్రాధాన్యమిస్తూ సంప్రదాయలను విస్మరించడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందన్నారు. పెరిగిపోయిన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఎన్నో జీవరాసుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందన్నారు. అంతరించుకుపోతున్న పక్షుల్లో పిచ్చుకలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. పూర్వం పిచ్చుకల సంరక్షణకు వరి కుచ్చులను ఇళ్ల, గుడుల ముందు వేలాడదీసేవారన్నారు. పిచ్చుకలు అంతరించుకుపోతే అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకొని ప్రజలను చైతన్య పరచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాకరాపల్లి కనకదుర్గ ఆలయం, కోటనందూరు రామాలయాల్లో గ్రామ ప్రజలతో కలిసి వరి కుచ్చులను వేలాడదీసారు. కార్యక్రమంలో మహర్షి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఏలేశ్వరం జగనన్నకాలనీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కప్పలచెరువు సమీపంలోని జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతిపేదవాడికి సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ ప్రియాంక, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



ఏలేశ్వరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 3, 4 వార్డుల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, జువ్విన వీర్రాజు, సిరిపరపు రాజేష్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

తుని రూరల్: రేషన్ సరకుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.శివకుమార్ హెచ్చరించారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ప్రతినిధులు, గొడౌన్ నిర్వాహకులు, సరకు రవాణా చేసే కాంట్రాక్టర్‌లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు సకాలంలో సరుకులు ఇవ్వాలన్నారు. అందుకు అనువుగా గొడౌన్ నుంచి కాంట్రాక్టర్ రవాణా చేయాలన్నారు. ఎవరైనా తూకాల్లో తేడాలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమాలకు పాల్పడినా, నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎంఎస్‌ఓ కిరణ్ కుమార్, తుని పట్టణ, రూరల్ డీలర్లు, ఎండీయూ, గొడౌన్ నిర్వాహకులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రాజా కళాశాల మైదానంలో భారీ స్క్రీన్ ఏర్పాటు

తుని: క్రికెట్ వన్ డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను అభిమానులు వీక్షించేందుకుగాను స్థానిక రాజా కళాశాల మైదానంలో భారీ స్క్రీన్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఏర్పాటు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు తెలిపారు. ఆదివారం ఇండియా, ఆస్ట్రేలియా మధ్య ఫైనల్ పోరు జరగనున్న విషయం తెలిసిందే. క్రికెట్ అభిమానులు తిలకించడానికి అనువుగా స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారని, మధ్యాహ్నం నుంచి మ్యాచ్ ముగిసే వరకు లైవ్ టెలికాస్ట్ చేస్తారని చెప్పారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీ అయిన పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఉషారాణి, ఉపాధ్యాయులు పి.అరుణకుమారి, రాచకొండ నాగగంగాభవానీలను నూతన హెచ్‌ఎం కె.లక్ష్మీకాంతం, ఎస్ఎంసీ చైర్మన్ పి.చిన్ని ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కోట సత్యవతి, వార్డు సభ్యుడు రామభద్రం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



మండపం పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ రమణ

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ ఎస్పీ రమణ సిబ్బందికి సూచించారు. మండలంలోని మండపం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. అదనపు తరగతి గదులు, గదుల్లో టైల్స్, ప్రహరీ నిర్మాణం తదితర పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, సీఆర్పీ డి.రాజుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

తుని: స్థానిక శాంతినగర్‌లోని జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వస్తోందని గ్రంథాలయాధికారి జి.రంగనాథరావు తెలిపారు. క్విజ్ పోటీల్లో తుని పరిసర ప్రాంతాలకు చెందిన 16 పాఠశాలల నుంచి 93 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఉపాధ్యాయుడు కె.నాగభూషణం పర్యవేక్షించారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ–సెబ్)పరిధిలోని శంఖవరం, ప్రత్తిపాడు మండలాల్లోని దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ శనివారం తెలిపారు. శంఖవరం మండలం వజ్రకూటం అటవీ ప్రాంతంలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వజ్రకూటం గ్రామానికి చెందిన కడింపల్లి మణికంఠను అదుపులోకి తీసుకొని కడింపల్లి తాతారావుపై పరారీ కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో నిర్వహించిన దాడుల్లో పరారీలో ఉన్న విత్తనాల శివను అరెస్టు చేశారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.